

తెలుగువారికి గర్వకారణం



చిగురుమామిడి: ప్రతి ఇంట్లో పెద్దలు, పిల్లలకు నూతన వస్త్రాలు కొనుగోలు చేసి వారికి కావాల్సిన కాస్మెటిక్స్ గాజులు, ఇతర సామగ్రికి ఎంతో ఖర్చు ఉంటుంది. ఆడపడుచులకు కావాల్సిన చీరలు మాత్రం ఎంతో ధరతో కూడుకుని ఉంటాయి. దేశ విదేశాల్లో కూడా బతుకమ్మ సంబరాలు నిర్వహించడం తెలుగువారికి గర్వకారణం.

– అందె స్వరూప, మాజీ సర్పంచ్, ఇందుర్తి

తీరొక్క పూలతో పేర్చి ఆడేదే బతుకమ్మ



చిగురుమామిడి: గ్రామాల్లో దొరికే తీరొక్క పూలతో పేర్చి ఆడేది బతుకమ్మ. ఈ పండుగలో తెలంగాణలోని ఆడపడుచులంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతుంటారు. దేశంలో ఎక్కడా లేని ఈ పండుగకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిచ్చింది.

– అందె సుజాత, మాజీ ఎంపీపీ

సంస్కృతికి ప్రతిబింబం



జమ్మికుంట: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం బతుకమ్మ పండుగ. నేటి యువత తెలంగాణ పండుగల విశిష్టత తెలియకుండా కొత్త ట్రెండ్‌కు అలవాటు పడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం తప్పనిసరి. బతుకమ్మ విశిష్టత, గొప్పతనం గురించి తెలియపరచాల్సిన అవసరముంది.

– కూర మంజులారెడ్డి, లెక్చరర్, జమ్మికుంట

క్లుప్తంగా

గుంతలు పూడ్చిన యువకులు



ట్రాక్టర్‌లో మొరం నింపుతున్న యువకులు

రామడుగు: దత్తోజీపల్లిలో రహదారుల్లో భారీగా గుంతలు పడడంతో గ్రామానికి చెందిన యువకులు శనివారం శ్రమదానం చేశారు. చెన్నూరి శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, మధుకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి ట్రాక్టర్లలో మొరం నింపుకొచ్చి గుంతలను పూడ్చారు. రెడ్డివాడ మలుపు వద్ద రహదారిపై భారీగా గండి పడడంతో.. మొరం పోసి పూడ్చి బాగు చేశారు.

వెంకటస్వామికి నివాళి



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట: పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నాయకులు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, దేవేందర్, వెంకన్న, పెద్ది కుమార్, కొమురయ్య, రాజబాబు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాకా జయంతి నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత, నియోజకవర్గ యూత్ నాయకుడు సందమల్ల నరేశ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి మిడిదొడ్డి రాజు, మేకల తిరుపతి, కొలిపాక శంకర్, ఎర్ర రవీందర్, సందమల్ల బాబు, ఎండీ అప్సర్, జంగ అనిల్, ఇమ్రాన్, ప్రతాపనాగరాజు, గంట కిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

చిగురుమామిడి: స్థానిక బస్టాండ్ ఆవరణలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీవీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం చేయండి

మానకొండూర్ రూరల్: జమాతె ఇస్లామి హింద్ మానకొండూర్ శాఖ ఆధ్వర్యంలో దైవ ప్రవక్త ముహమ్మద్ జన్మమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని సుప్రీం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

మానసాదేవికి కానుక అందజేత



చంద్రారెడ్డికి కానుక అందజేస్తున్న రజిత–తిరుపతిరెడ్డి

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామ శ్రీమానసాదేవి ఆలయానికి రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పల్లికుంటపల్లె గ్రామానికి చెందిన పీచు రజిత–తిరుపతిరెడ్డి దంపతులు అర తులం బంగారాన్ని శనివారం అందజేశారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ అర్చకుడు పెండ్యాల అమర్‌నాథ్‌శర్మ, డైరెక్టర్లున్నారు.

నిధులు మంజూరు చేయాలి

వీణవంక: దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. మంజూరు చేయకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపడతామని హెచ్చరించారు. ఇంజం వెంకటస్వామి, రేణుకుంట సాగర్, మోరే ఆరుణ్, కండె మహేందర్, సంపత్, రమేశ్, రామంచ రాకేశ్, రక్షిత్, లచ్చన్న ఉన్నారు.

పలువురిపై కేసు

గన్నేరువరం: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి, గన్నేరువరం మండలం గుండ్లపల్లికి చెందిన పుట్ట కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. పొలంలో పశువుల మేత విషయంలో కులం పేరుతో దూషించారని గుండ్లపల్లికి చెందిన సుంకరపల్లి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు వివరించారు. గుండ్లపల్లికి చెందిన సుంకరపల్లి అనిల్, సుంకరపల్లి రాజయ్యపై కేసు నమోదైనట్లు ఎస్సై తెలిపారు. పంట చేనును పశువులతో ఎందుకు మేపుతున్నావని ప్రశ్నించినందుకు అనిల్, రాజయ్య బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారని దేవక్కపల్లికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చరిత్ర పాఠాలు.. ప్రత్యక్ష అనుభవంలోకి..

- మల్లాపూర్ జెడ్పీ విద్యార్థుల ఢిల్లీ ఫీల్డ్ విజిట్
- చారిత్రక ప్రదేశాల సందర్శన
- మురిసిన చిన్నారులు



ఢిల్లీలో ఫీల్డ్ విజిట్ చేస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: మల్లాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో సెలవుల్లోనూ తమ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఢిల్లీ ఎక్స్‌కర్షన్‌కు వెళ్లారు. పుస్తకాల్లో చదివిన చరిత్ర పాఠాలను ప్రత్యక్షంగా వీక్షించారు. మర్చిపోలేని అనుభవం సొంతం చేసుకున్నారు. హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ నేతృత్వంలో 8వతరగతి విద్యార్థులు కె.శ్రుతి, పి.రశ్మిత, పి.సాత్విక్ ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారు.

హిందీ పాఠం ఢిల్లీ సే పత్ర్ ఆధారంగా..

ఎనిమిదో తరగతి హిందీ పాఠ్య పుస్తకంలోని ఢిల్లీ సే పత్ర్ అనే పాఠాన్ని చదివించి అందులో చెప్పబడిన చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యం విద్యార్థులకు అవగాహన కోసం షరీఫ్ అహ్మద్ ఈ పర్యటనను నిర్వహించారు. ఢిల్లీ పర్యటన విద్యార్థులకు పాఠ్యంలోని విషయాలను ప్రత్యక్షంగా వీక్షించి అర్థం చేసుకునే అవకాశం కలిగించింది.

చారిత్రక ప్రదేశాల సందర్శన..

ఈ పర్యటనలో విద్యార్థులు దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని రెడ్ ఫోర్ట్(లాల్ కిల్లా), లోటస్ టెంపుల్, కుతుబ్ మినార్, ఇండియా గేట్, పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్, అక్షర్ధామ్ టెంపుల్ వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. లాల్ కిల్లాలోని మొఘల్ చక్రవర్తుల హయాంలోని చారిత్రక నిర్మాణాలు, అబ్బురపరిచే శిల్ప కళను చూసి ఆశ్చర్యపోయారు. కుతుబ్ మినార్ వంటి అద్భుత నిర్మాణాలు చూశారు. లోటస్ టెంపుల్‌లోని సౌందర్యం ఆస్వాదించారు. ఈ పర్యటనతో విద్యార్థులకు చారిత్రక జ్ఞానం పెరిగింది. శ్రుతి, రశ్మిత, సాత్విక్ ఈ పర్యటన అనంతరం తమ అనుభవాలను పంచుకున్నారు.

ఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు

విద్యార్థులు తమ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్‌కు కతజ్ఞతలు తెలిపారు. వారి ప్రయత్నం, నిబద్ధతతో ఈ పర్యటన ఎంతో విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు.



చొప్పదండి: పట్టణంలోని అంగడిబజార్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని డివైడర్ ఏర్పాటు చేసి సంవత్సరాలు గడిచినా లైట్లు ఏర్పాటు చేయడం లేదు. డివైడర్ మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయడానికి నిర్మాణాలు చేసి వదిలేశారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలి.

– ఎన్నం మునిందర్, చొప్పదండి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి, సెల్ నంబర్: 9949267882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

వాగేశ్వరిలో బతుకమ్మ వేడుకలు



తిమ్మాపూర్: వాగేశ్వరి ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. విద్యార్థినులు మహిళా అధ్యాపకుల సహకారంతో బతుకమ్మలు పేర్చారు. కళాశాల మైదానంలో బతుకమ్మలను ఒక్కచోట ఉంచి డీజే పాటలకనుగుణంగా బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేదే బతుకమ్మ పండుగని సెక్రటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి గంద్ర శోభారాణి అన్నారు. జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, రామకష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కిట్స్ కళాశాలలో..



చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు

బతుకమ్మ సంబరాలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మలను రంగురంగుల పూలతో పేర్చి ఆడారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ ఘనంగా జరుపుకున్నారు.

చిగురుమామిడి: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయా శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శనివారం మండల పరిషత్, తహసీల్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులు ఆడిపాడారు. ఎంపీడీవో ఖాజామొయినొద్దీన్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోదరి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లు పూర్తి చేయాలి

గన్నేరువరం: గ్రామాల్లో చెరువులు, కుంటల వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రామానుజాచారి అన్నారు. గన్నేరువరంలోని రైతు వేదికలో శనివారం గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో బతుకమ్మ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళలకు ఇబ్బందులు లేకుండా లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెఫరీగా ఎంపిక



ప్రభాకర్, వెంకటేశ్

రామడుగు: రామడుగుకు చెందిన సీనియర్ క్రీడాకారులు నమిలకొండ ప్రభాకర్, మూల వెంకటేశ్ హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీగా కరీంనగర్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వేంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి: ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా సీపెల్లి నరేశ్‌ను నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ తెలిపారు. ఆర్నకొండ గ్రామ అధ్యక్షుడిగా మోడుంపల్లి సంపత్, ఉపాధ్యక్షుడిగా గద్దపాక అనిల్, ప్రధాన కార్యదర్శిగా చిలుముల మహేశ్, కార్యదర్శులుగా మోడుంపల్లి శేఖర్, ఉదయ్ ఎన్నికయ్యారు.

ఆర్నకొండ గ్రామ శ్రీరాజరాజేశ్వర తాపీమేస్త్రీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కల బాబు, ప్రధాన కార్యదర్శిగా కదారి అశోక్, గౌరవ అధ్యక్షుడిగా మోడుంపలి అంజయ్య, గౌరవ సలహాదారుగా గంటల రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గొల్ల గట్టయ్య, ఆర్గనైజర్‌గా కాటం శంకర్, కోశాధికారిగా ఎముండ్ల మల్లేశం, కార్యదర్శిగా చాతర్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీణవంక: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కండె మహేందర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అనిల్ ఉత్తర్వులు జారీ చేశారు. మహేందర్ మాట్లాడుతూ.. నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రికెట్ పోటీలు



టాస్ వేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ 4వ సీజన్ పోటీలను ఆయన టాస్ వేసి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. విన్నర్ జట్టుకు కప్‌తోపాటు రూ.20వేల నగదు, రన్నర్ జట్టుకు రూ.10వేల నగదు, కప్ అందిస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ మాజీ సభ్యుడు సాంబారి కొంరయ్య, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆకవరం శివప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ ఒంటెల కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎన్ఎం వరి వంగడం సాగు చేయాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

శంకరపట్నం: కేఎన్ఎం12368 సన్న రకం వరి వంగడం రైతులు సాగు చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వరి ప్రధాన శాస్త్రవేత్త దామోదర్‌రాజు సూచించారు. చింతలపల్లి గ్రామంలో శనివారం చిన్న సంచుల దశలో వరి రకాల సాగుపై ప్రొఫెసర్ జయశంకర్ వరి ప్రధాన శాస్త్రవేత్తలు దామోదర్‌రాజు, కిరణ్‌బాబు రైతులకు అవగాహన కల్పించారు. కునారం శాస్త్రవేత్త శ్రీధర్ కేఎన్ఎం 12368 సన్న రకం వరి వంగడాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీపీటీ, హెచ్ఎంటీ వరి రకాలకు దీటుగా నూతన వరి రకాన్ని తయారు చేశారన్నారు. తెగుళ్లు సోకకుండా నూతన వంగడాన్ని సాగు చేసుకుంటే దిగుబడులు సాధించొచ్చన్నారు. ఏడీఏ శ్రీధర్, కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో వెంకటేశ్, ఏఈవోలు రాజ్‌కుమార్, సునంద, కీర్తన పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ముగిసిన కళోత్సవాలు



విద్యార్థుల నృత్యం

తిమ్మాపూర్: రాష్ట్రీయ ఏక్తా పర్వ్ క్లస్టర్ లెవల్‌లో భాగంగా అలుగునూర్‌లోని కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో ఏక్ భారత్–శ్రేష్ఠ్ భారత్, కళోత్సవ్ రంగాల్లో నిర్వహించిన స్పర్ధల్లో బోలారం క్లస్టర్లోని తొమ్మిది పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం, గానం, నత్యం, కళాప్రదర్శనలు, వారసత్వ కళారూప ప్రదర్శన, హర్యానా రాష్ట్రానికి సంబంధించిన హస్తకళా ప్రదర్శన, వాద్య సంగీత విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

సాయికుమార్ కుటుంబాన్ని ఆదుకుంటా



సాయికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: ఈదులగట్టెపల్లిలో శుక్రవారం ఇంట్లో సజీవ దహనమైన అంగడి సాయికుమార్ అనే బాలుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్చురీలోని సాయికుమార్ మృతదేహాన్ని చూసి చలించిపోయారు. సజీవ దహనానికి గల కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. బోరున విలపిస్తున్న సాయికుమార్ తల్లిదండ్రులు అనిత, రాజ్‌కుమార్‌ను ఓదార్చారు. అగ్ని ప్రమాదంలో సాయికుమార్ సజీవ దహనం కావడం అత్యంత విషాదకరమన్నారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మీస సత్యనారాయణ, ఈదులగట్టెపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు చిలగాని సదయ్య, నాయకులు పాల్గొన్నారు.

విజయదశమి కానుకగా డీఏలను ప్రకటించాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఏలను విజయదశమి కానుకగా ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికుల పెన్షన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మానకొండూర్ సీఐగా లక్ష్మీనారాయణ

మానకొండూర్: మండల పోలీస్ స్టేషన్ సీఐగా లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు పని చేసిన సీఐ గడ్డం సదన్‌కుమార్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా.. తిమ్మాపూర్ మండల సీఐ స్వామి ఇన్‌చార్జిగా సేవలందించారు. జగిత్యాల సీసీఎస్ నుంచి లక్ష్మీనారాయణ మానకొండూర్ స్టేషన్‌లో విధుల్లో చేరారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ



భూపాలపట్నంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

చొప్పదండి: ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళపల్లి, భూపాలపట్నం, చొప్పదండి, రెవెళ్లి గ్రామాలకు చెందిన 100 మంది మహిళా రైతులకు 5 రకాల కూరగాయల విత్తనాల కిట్లను శనివారం పంపిణీ చేశారు. చొప్పదండి డివిజన్ ఉద్యానవన శాఖాధికారి రోహిత్ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సేంద్రియ పద్ధతిలో పెరటి తోటల పెంపకం, కూరగాయల సాగు చేపడితే ఆరోగ్యాలు బాగుంటాయని, తద్వారా ఆసుపత్రి ఖర్చులు తగ్గుతాయన్నారు. మాజీ జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, సంస్థ డైరెక్టర్ ప్రీతి, దీప్తి, మర్రి మేల్లశం, ఏరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేలాంకిని, రూప, స్రవంతి, మౌనిక, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని 7వ వార్డులో డ్రైనేజీ ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నాడని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెంకటలక్ష్మి పేర్కొన్నారు. వార్డు మొదట ఉన్న పెద్దన్న డ్రైనేజీ స్థలాన్ని ఆక్రమించుకొని నూతనంగా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడన్నారు.

అక్రమ కట్టడాలపై..

హుజూరాబాద్‌రూరల్: పట్టణం, మండలంలోని పలు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు యువజన కాంగ్రెస్ నాయకుడు శ్రావణ్ తెలిపారు. చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు లోకాయుక్త నుంచి శనివారం ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు.

బీసీ హక్కుల సాధనకు నిరంతర పోరాటం



బీసీ నాయకుల అభివాదం

శంకరపట్నం: బీసీ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీసీ ఆత్మీయ సదస్సు జరిగింది. రాష్ట్ర అధికార ప్రతినిధి అభిలాష్, హన్మంతు, సత్తయ్య, కొత్తపల్లి రవి, తిరుపతి, సురేశ్, పోచయ్య, రాజ్‌కుమార్, రాసమల్ల శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట.. బెడద తీరేనా..



కుక్కలను పట్టుకుంటున్న యువకులు

చొప్పదండి: పట్టణంలో కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు వాటి బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్స చేయించే చర్యలను చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆధ్వర్యంలో కుక్కలను పట్టుకునే కార్యక్రమంలో భాగంగా పది కుక్కలను కరీంనగర్‌లోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. పట్టణంలో వీధివీధికి కుక్కల బెడద పెరుగుతుండటంతో అధికారుల చర్యలు ఎంతవరకు సత్ఫలితాలనిస్తాయో అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వాడలో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో ప్రయాణానికి ప్రజలు జంకుతున్నారు. బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్స పండుగల నేపథ్యంలో ఎంతవరకు ఫలితమిస్తుందో వేచి చూడాల్సిందే.

సంజయ్‌ను పరామర్శించిన మాజీ మేయర్



సంజయ్‌ను పరామర్శిస్తున్న రవీందర్‌సింగ్

శంకరపట్నం: బీసీ హక్కుల సాధనకు 9 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆస్పత్రిలో చికిత్స పొందిన జక్కని సంజయ్‌ను శనివారం మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హరిప్రసాద్, కార్పొరేటర్ శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న జలెందర్

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి, హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు, సిబ్బందికి శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పొరల సమస్యలున్న కార్మికులను ఆపరేషన్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. డాక్టర్ సంధ్యారాణి, పారామెడికల్ అప్తాల్మిక్ ఆఫీసర్ జలెందర్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, ఫార్మసిస్ట్ రాజుశ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాము, సిబ్బంది పాల్గొన్నారు.